లక్ష్మి

శ్రీమతి
దేశిరాజు
భారతీదేవి

★

కోటమ్మకిద్దరుపిల్లలు. పెద్దదైన కామాక్షికిమాత్రము పెండ్లి జేసింది. ఆమెభర్త చనిపోయినాడు. యెనిమిదేండ్ల యీడుగల కొడుకు మాత్రము తండ్రిపోయినతర్వాత అదుపాజ్ఞలులేక దుస్సాంగత్యముచేత తల్లిమాటవినక ఒకనాటిరాత్రి చెప్పకుండా యెక్కడకో పారిపోయినాడు. భర్తపోయిన దుఃఖానికి తోడుకొడుకు దుష్ప్రవర్తన యామెను కృంగదీసింది. యెంతవెదకినా యెచ్చటా దొరకలేదు. ఇక నిరాశజెంది కామాక్షినే అన్నిటికిని దిక్కునినమ్మి ఆమెవద్దనే వున్నది కోటమ్మ. కాని తగిలినవేలుకే తగులుతుందను సామ్యమట్లు కోటమ్మకష్టాలు గట్టెక్కలేదు. ప్రసవమై పదిరోజుల పసికూనను తల్లికివప్పగించి కోటమ్మకూతురు చనిపోయినది. దుర్భరగర్భశోకమునకుతోడు పసిబిడ్డ పెంపక మామెకత్యంత బాధాకరమైనది. వెంటనే ఆ పసికూననుతీసికొని చేరువనేయున్న ఒక బస్తీచేరి ఆ బాలికను పోషించుకొంటూ తన పొట్టబోసుకుంటున్నది. తర్వాత సంవత్సరానికి కోటమ్మ అల్లుడుగూడ పాముకఱచిపోయినట్లు విని తన దురదృష్టానికి మిక్కిలి వగచింది కోటమ్మ. ఇక లక్ష్మికి దిక్కులేదు 'తాను చనిపోతే ఆ బాలికగతియేమిటి?' అనే దిగులుతో నానాటికి కృంగి కుళ్లిపోతున్నది కోటమ్మ. కాని యేమిచెయ్యగలదు?

* * *

కాలచక్రం గిఱ్ఱున తిరిగిపోతూన్నది. లక్ష్మి వ్యక్తురాలైనది. కోటమ్మ యారాటము యెక్కువైనది. తాను పాచిపనిజేసేయింట్లో లక్ష్మిని ప్రవేశపెట్టి తాను మనమరాలి పెండ్లివిషయమై వరుణ్ణి వెదకసాగింది. తనశక్తివంచనలేకుండా ప్రయత్నంజేసింది. తుదకొక రెండవపెళ్లివరుణ్ణి కుదుర్చింది కోటమ్మ. వాడివిషయం విచారించిచూచిన లక్ష్మికి పైప్రాణంపైనే యెగిరిపోయింది. వానివిషయమై కోటమ్మకు తెలిసినదంతయు వట్టికల్ల. కాని అమాయకురాలగు కోటమ్మ వాని మాయమాటలు నమ్మింది. వెంటనే పెండ్లిజేసి తనబరువు తీర్చుకుందామని వూహించింది. లక్ష్మికి తెలియజేసింది. ఆమె యిష్టపడలేదు. కొన్నాళ్లు గడిచాయి.

ఒకనాటిప్రొద్దుట పాచిపనిజేసి యింటికొచ్చేప్పటికి అవ్వపిలిచి తనుపండుకున్న మంచంమీద కూర్చోమనిచెప్పి మనుమరాలితో యిట్లా చెప్పింది. 'లచ్చీ, నేనింక ఎక్కువరోజులు బతికేట్టుగాలేను. నాకున్నదల్లా నీ పెండ్లివిషయమే దిగులు. నీవొకయింటిదానివైతే చూచిపోతాను. నాదిగులు తీరుతుంది. ఆనక నీవేమి తిప్పలుపడుతావో. దిక్కులేనిదానివై యీ గుడిసెలో వక్కదానివేవుంటే నిన్నెవరేమంటారో. అమ్మా, నామాటినుకోతల్లీ. వాణ్ణి జేసుకో'మంటూ హితబోధజేసింది. అసహాయురాలగు ఆబాలిక యేమి చెయ్యగలదు? అమాయకురాలైన అవ్వ లోకులమాటలువిని తనసుఖము చూడటములేదు. పెండ్లిచెయ్యడమే ప్రధానమనుకొంటున్నది గాని వేరేయాలోచనయేమీ చేయటములేదు. 'అవ్వా, ఆలోచించి మాపిటాళ చెపుతాలేయే, నన్నెందుకు గోలబెడతావు' అన్నది ధైర్యంతో.

ప్రతిరోజూ వెళ్లేవేళతప్పి పనిలోకి వెళ్లడము, మామూలుగా వుండే వుత్సాహమేమీ లేకుండా చిక్కమొగముతో దుఃఖాన్ని దిగమ్రింగుకుంటూవచ్చిన లక్ష్మినిచూచి యజమానురాలు సత్యవతమ్మగారు 'ఏమే లక్ష్మీ, చాలా ఆలస్యముగావచ్చావు? అట్లావున్నావేమే' అన్నది. ఆ మాటకు భయపడి 'ఏమీ లేదమ్మా. నిద్రబోయిలేచి యిప్పుడేవచ్చాను. దబ్బున మెలకువ రాలేదమ్మా' అంటూ మొగంతిప్పుకుని వెళ్లి అంట్లుతోముతూ కూర్చున్నది లక్ష్మి. కాని వచ్చిందిమొదలు దానివాలకమంతా కనిబెట్టివున్న సత్యవతమ్మ గారు యెట్లాగైనా దానిసంగతి పూర్తిగా తెలుసుకోవాలని అనుకుంది.

సర్కిల్ యినస్పెక్టర్ వెంకయ్యనాయుడుగారికి క్రొత్తగా యీవూరు బదిలీయైనది. వారువచ్చి నాలుగుమాసాలేగాని, డాక్టరు నారాయణరావు పంతులుగారికి నాయుడుగారికి మంచిస్నేహము కుదిరింది. నారాయణరావుగారు వస్తుతః ఉదారస్వభావులు. యితరుల కష్టములుచూచి సహించలేరు. ఎవరికే యాపద వచ్చినా తనకేవచ్చినట్లు భావించి వారికివచ్చినకష్టము తీరేవరకు వూరుకోక తన శక్తికొద్దీ సహాయముచేసే వాడు. బీదలకు వుచితముగా మందులివ్వడము, నిరుద్యోగులకేదైన పనిగల్పించి సహాయముచెయ్యడము, ఆయన ముఖ్యనియమాలు. నాలుగుమాసాల స్నేహంలోనే వెంకయ్యనాయుడి కుటుంబపరిస్థితులన్నీ విచారించాడు. వెంకయ్యనాయుడు తనబాల్యములోనే యెవ్వరికీచెప్పకుండా బొంబాయివెళ్లడము, అచ్చట ఒక మహాశయుని సహాయమువల్ల చదువుకోవటము, అక్కడే పెండ్లాడి ఉద్యోగియై స్వదేశానికి తిరిగి రావడము, తల్లిని విచారించడము, ఆమెసంగతేమీ తెలియక నిరాశజెందటము, ఆరుమాసములక్రిందట భార్యచనిపోవడము, తానావూళ్లోవుండలేక యీవూరు బదిలీ చేయించుకోవడము మొదలైన సంగతులన్నీ తెలుసుకున్నాడు; తన భార్యకూడా తెలియజేశాడు. తల్లిలేనిపిల్లలని నాయుడుగారి పిల్లలిద్దరిని తనపిల్లలతో సమంగా ఆదరించే వారాదంపతులు. మళ్లీ నాయుడుగారికి పెండ్లిజేయాలని సత్యవతమ్మ నారాయణరావుగార్లు ప్రయత్నం జేస్తున్నారు.

* * *

లక్ష్మి మామూలుపనులన్నీ దీర్చి 'అమ్మా శలవిప్పిస్తారా! పనులన్నీ అయినాయి' అన్నది సత్యవతమ్మగారితో. ఆమెనవ్వుతూ 'వెళ్లుదువుగాని, రా పనియున్నది' అంటూ మేడమీదకు తీసికొనివెళ్లి తానొకకుర్చీలో కూర్చుని లక్ష్మిని దగ్గరగా కూర్చోమంది.

సత్యవతమ్మ:-లక్ష్మి నీవివ్వాళ ఏమో దిగులుగావున్నావు. చాలా యేడ్చినట్లుగా నీ మొగమంతా కందిపోయింది. మీఅవ్వ కులాసాగా యున్నదా?

లక్ష్మి:-ఏమి కులాసా తల్లీ, ఏమి బాగాలేదు దానిసంగతి అయ్యగారిచ్చిన మందు పోస్తున్నాను. దానికేమి? నయమైనా కాకపోయినా మారాజే, వున్నవాళ్లకేగదమ్మా తిప్పలు?

అంటూ కళ్లనీళ్లుబెట్టుకున్నది. ఆమాటవిని సత్యవతమ్మగారు కేవలము అవ్వజబ్బువల్లనే యీపిల్ల దిగులుపడుతున్నట్లు లేదు. వేరే యేదో కారణమున్నట్టు గ్రహించి చాలా ఆదరముగా, 'లక్ష్మీ నీకు వేరే దిక్కెవ్వరూలేరుగదా? నేను నీతల్లివంటిదాన్ని. నీమనస్సులోసంగతి దాచకుండా నాకుచెప్పు నాచేత నయినంత సహాయముచేస్తాను. కేవలము నీకు అవ్వనుగూర్చిన దిగులేగాకుండా యేదోయితరమైన దిగులుతో బాధపడుతున్నావు. నాతోచెప్పనిది నిన్ను యివ్వాళ యింటికి వెళ్లనీయను' అన్నది. ఆమాట కాబాలిక హృదయం పులకరించిపోయింది. తనవిషయమంత శ్రద్ధగా కనుగొనవలెనను కుతూహలము జూపినవారుగాని, తనయందంతాదరము కనబఱచినవారుగాని యిదివరకెవ్వరూ కనబడలేదు. సత్యవతమ్మగారే తనకా సమయములో తల్లివలె తోచిందామెకు. తనఅవ్వచనిపోతే యికదిక్కు యీతల్లేగదా! యీమె పోషకురాలు కావున యీమెకుచెప్పక యింకెవ్వరికి చెప్పేదనుకొన్నది. వూసగ్రుచ్చినట్టు తనసంగతంతా చెప్పి ఆమె కాళ్లురెండూపట్టుకొని భోరున విలపించినది లక్ష్మి. దిక్కులేనితనానికి బిడ్డలతల్లియగు ఆ మాతృహృదయం ద్రవించిపోగా కన్నులార్ద్రములైనవి. 'లక్ష్మి, నీవు దుఃఖపడవద్దు. నీవు నా బిడ్డవంటిదానవు. నీకు పెండ్లిజేసే భారమునాది. నీవు మీఅవ్వమాటలు వినవద్దు. ఆ త్రాగుబోతువాణ్ణి చేసికోవద్దు' అంటూ ఖండితముగా జెప్పి, భయపడవద్దని అభయహస్త మిచ్చిందామె.

మనుమరాలు తనమాటను త్రోసివేస్తుందని కల్లోకూడా తలపోయలేదు కోటమ్మ, కాని యేమి చేస్తుంది? ఆరోజుకారోజు కామెవ్యాధి తీవ్రరూపము దాల్చుతోంది. లక్ష్మి పూర్తిగా నిరాశజెందింది. అయ్యగారి దగ్గఱకెళ్లి మొఱబెట్టుకొన్నది. కాసేపుండి వచ్చిచూచి మందిస్తానని నారాయణరావుగారు చెప్పి పంపినారు.

వెంకయ్యనాయుడిగారితో కలిసి షికారు వెళ్లుతూ త్రోవలో కోటమ్మ గుడిసెలో కాలు పెట్టినాడు నారాయణరావుగారు. లోపల కోటమ్మ లక్ష్మికి కుదిర్చిన వరుడు చాల గడబిడ జేస్తున్నాడు. వ్యాధిచేత బాధపడుతూన్న కోటమ్మను త్రాగివచ్చిన మత్తులో అనరానిమాటలని యింకా యెక్కువ బాధబెడుతున్నాడు. డాక్టరుగారిని చూడగానే లక్ష్మి సంతోషముతో 'రండయ్యగారు' అంటూ లేచింది. ఆయనవెళ్లి 'కోటీ, కులాసాగా వున్నావా?' అంటూ ఆమె చెయ్యిచూచి, గుండె పరీక్షజేసి 'సరే మందు పంపుతాను. కాని వీడెవ్వడు' అన్నాడు అందుకా త్రాగుబోతు 'చూడండయ్యా, పెద్దమనుసులు. యీ ముసిల్ది నాకు పిల్లనిస్తానని జెప్పి యిప్పుడొల్లకాదంటది' అంటూ తీవ్రంగా అరవడము మొదలుబెట్టినాడు. ఈ కేకల కిరుగుపొరుగులంతా మూగినారు. రోడ్డుమీద నిలబడివున్న వెంకయ్యనాయుడు లోపలకొచ్చి చూచి, మనిషిని గుర్తుబట్టి యీ త్రాగుబోతు వాడిదివరలో చోరీ నేరం క్రింద అరెస్టయి, జామీనుమీద విడదల్తె యున్నట్టు చెప్పినాడు కోటమ్మ సంగతంతా చెప్పి యీ ముదుసలిని వీడు పిల్లనివ్వలేదని పీడిస్తున్నట్లు డాక్టరుగారు నాయుడుగారికి చెప్పగా తొందరగా కోటమ్మదగ్గఱకెళ్లి నిదానించి చూచి, నిశ్చేష్టుడై కొంతసేపటికి తెప్పరిల్లి 'అమ్మా' అంటూ ఆమెమీద వ్రాలిపోయినాడు వెంకయ్యనాయుడు. 'అమ్మా' అన్నమాట చెవిబడగానే పంచప్రాణాలు లేచివచ్చినట్లు కాగా ఆనందాతిరేకమున 'నాయనా, వెంకూ యెక్కడకెళ్లావు? యెక్కడున్నావు? యెప్పుడొచ్చావు?' మొదలైన ప్రశ్నలవర్షం కురిపించింది కోటమ్మ. తాను మంచి హోదాగల ఉద్యోగియైయుండి ఆవూళ్లోనే తనతల్లి దిక్కులేక దీనతగావున్న సంగతి వెంకయ్యనాయడి కడుపులో చెయ్యిబెట్టి కలచినట్లయింది. కోటమ్మ మాటలకేమీ సమాధానం చెప్పలేకపోయినాడు. కొంచెముసేపెవ్వరు మాట్లాడలేదు. 'అయ్యా మీ అక్క చనిపోతూ పదిరోజులబిడ్డను నాకువప్పగించి పోయింది. మీ బావకూడా పోయినాడు. దిక్కులేని యీ బిడ్డను పెంచాను. దేవుడిదయవల్ల నువ్వు మళ్లీ కనబడ్డావు. నాయనా, నాదిగులు తీరింది. దీనికి నువ్వేదిక్కు. లచ్చీ! రా తల్లి. మీమామ యిడుగో. దేముడుదయవల్ల మళ్లీ మా నాయనకళ్లకు కనబడ్డాడు. నీకుకూడా వీడే దిక్కుతల్లి' అంటూ ఆనందాతిశేకముచేత కన్నీళ్లుగార్చింది. సంతోషము సగముసత్తువ అన్నట్లు చాలాకాలమునుండి లేవలేక నీరసముగావున్న కోటమ్మ లేచి కూర్చున్నది విషయమంతా నిమిషములో గ్రహించిన నారాయణరావుగారు వెంటనే బండినొకటిపిలిపించి లక్ష్మిని, కోటమ్మను ప్రయాణము చేయసాగినాడు. లక్ష్మిని డాక్టరుగారింట్లో పనిజేసేసమయములో చూచివున్న నాయుడు మళ్లీ యిప్పుడుచూచి చాల కటకటపడ్డాడు వెంటనే డాక్టరుగారి ప్రోత్సాహముచేత వెంటనే తల్లిని, కోడల్ని తనయింటికి తీసుకునివెళ్లినాడు నాయుడు.

శుభముహూర్తమున లక్ష్మిని వెంకయ్యనాయుడికిచ్చి పెండ్లిజేయించినాడు నారాయణరావుపంతులు. మనుమరాలిని తనకొడుకు వివాహమాడుట కళ్లారచూచి ఆనందించింది కోటమ్మ. కాని కొద్దిరోజులలోనే తానీలోకాన్ని విడచిపోయింది. కాని లక్ష్మిమాత్రం మామెను మరచిపోలేకపోయింది చాలాకాలము. డాక్టరు దంపతుల ఆశ్చర్యానికి మేరలేదు. ఎప్పుడైనా వెళ్లితే సంతోషంగా 'లక్ష్మి, నీ పెండ్లిజేసేభారం నాదే' నంటూవుంటుంది నవ్వుతూ, సత్యవతమ్మగారు.